ట్రాన్స్‌కో నిర్లక్ష్యం.. ఆగిన ఇళ్ల నిర్మాణాలు

• ఇళ్ల మీదుగా విద్యుత్ లైన్లు • షిఫ్టింగ్ చార్జ్ కట్టినా మార్చని అధికారులు • మెటీరియల్ లేదంటూ జాప్యం



ఎస్సీ కాలనీలో ఇళ్ల మీదుగా వెళ్తున్న విద్యుత్ లైన్లు



యాదవపేటలో లైన్లు వల్ల పిల్లర్ల వరకు వేసి మధ్యలో వదిలేసిన నిర్మాణం

నక్కపల్లి: ట్రాన్స్‌కో నిర్లక్ష్యం వల్ల పలు ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోతున్నాయి. ఏటా విద్యుత్ చార్జీలు, సర్‌చార్జీలు, ట్రూఅప్ చార్జీలు పేరుతో భారం మోపుతూనే వినియోగదారుల కష్టాలు గురించి పట్టించుకోవడం లేదు. ప్రతి నెలా కరెంటు బిల్లు చెల్లింపులో ఒక్క రోజు ఆలస్యమైనా వెంటనే సరఫరా నిలిపేసి ఫ్యూజ్‌లు పట్టుకుపోవడం, మీటర్లు తొలగించడం వంటి చర్యలకు ఉపక్రమిస్తున్న అధికారులు క్షేత్రస్థాయిలో సమస్యలు తమకు సంబంధం లేదన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. పర్యవసానంగా ట్రాన్స్‌కో వారికి వేలాది రూపాయలు చార్జీలు చెల్లించి కార్యాలయాల చుట్టూ నెలల తరబడి తిరగాల్సి వస్తుందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా గ్రామాల్లో ఇష్టారాజ్యంగా వేసిన విద్యుత్ స్తంభాలు, లైన్ల వల్ల కొత్త ఇళ్ల నిర్మాణానికి ఆటంకం కలుగుతోందని వాపోతున్నారు. లైన్లు మార్పించడం కోసం నెలల తరబడి ఇళ్ల నిర్మాణాలను ఆపేసుకోవాల్సి వస్తుందని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

45 రోజులైనా లైన్ మార్పించడం లేదు..

ఉద్దండపురంలో ఎస్సీ కాలనీలో పులిమార్తమ్మ తన సొంత స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టింది. ఈమె స్థలంలో నుంచి వీధి లైట్లు ఇతర వినియోగదారుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ లైను ఉంది. తాజాగా ఆమె ఇల్లు నిర్మాణం (రెండో అంతస్తు) ప్రారంభించింది. పిల్లర్లు వేసి శ్లాబ్ వేసే క్రమంలో ఇంటి మీదుగా వెళ్తున్న విద్యుత్ వైర్లు అడ్డం వచ్చాయి. వెంటనే ట్రాన్స్‌కో అధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్లగా, తన స్థలం మీదుగా వేసిన లైన్లు మార్చాలంటే ప్రభుత్వానికి షిఫ్టింగ్ చార్జీ చెల్లించాలన్నారు. గత్యంతరం లేక ఎస్టిమేషన్ మేరకు ఆన్‌లైన్లో రూ.12 వేలు షిఫ్టింగ్ చార్జ్ కోసం చెల్లించింది. ఇది జరిగి దాదాపు 45 రోజులు గడచిపోయింది. ఇప్పటి వరకు విద్యుత్ లైను మాత్రం మార్చలేదు. రోజూ కార్యాలయం చుట్టూ తిరుగుతుంటే సంబంధిత అధికారులు లైన్లు మార్చడానికి అవసరమైన మెటీరియల్ లేదని, ప్రభుత్వం సరఫరా చేస్తేనే తాము లైన్లు మారుస్తామని అంతవరకు ఏమీ చేయలేమని సమాధానం చెబుతున్నారు. ఈ క్రమంలో వారం రోజులు సమయం కావాలని కోరడంతో 15 రోజుల తర్వాత వెళ్లి అడిగితే ప్రభుత్వం నుంచి మెటీరియల్ రాలేదు. తామేమీ చేయలేమని సమాధానం చెబుతున్నారని మార్తమ్మ వాపోయింది. స్థానిక ఎంపీటీసీ బచ్చల రాజు దృష్టికి తీసుకెళ్లి ఆయన ద్వారా ట్రాన్స్‌కో ఏఈని సంప్రదిస్తే ఎంపీటీసీకి కూడా పై విధంగా సమాధానం చెప్పారు. వినియోగదారుడి నుంచి వేలాది రూపాయలు వసూలు చేసి సమస్యను సకాలంలో పరిష్కరించడకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

లైన్ షిఫ్టింగ్ చేయక నిలిచిన ఇళ్ల నిర్మాణం..

ఇదే గ్రామంలో యాదవ పేటలో కొర్రా అప్పారావుకు ఇలాంటి సమస్య వచ్చింది. అతను తన ఇంటి నిర్మాణానికి విద్యుత్ లైన్లు అడ్డువస్తే షిఫ్టింగ్ కోసం రూ.15 వేలు చెల్లించాడు. ఇంతవరకు లైన్లు మార్చలేదు. నెలల తరబడి పనులు ఆపుకుని వేచి చేయాల్సి వస్తోందని భవన నిర్మాణదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చేసిన పొరపాట్లకు తాము ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా సమస్య పరిష్కారం కోసం నెలల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని, లైన్లు ఎప్పుడు మారుస్తారో కచ్చితంగా చెప్పడం లేదని వారు వాపోతున్నారు. బిల్లు చెల్లించడం ఒక రోజు ఆలస్యమైతే వినియోగదారులు పరువు పోయే విధంగా విద్యుత్ సరఫరా నిలిపేస్తున్న ట్రాన్స్‌కో వారు సమస్యల పరిష్కారంలో మాత్రం నిర్లక్ష్యం చూపుతున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దాదాపు 45 రోజుల నుంచి వేచి చూస్తున్నామని ఇప్పటికైనా అధికారులు స్పందించకపోతే సబ్ స్టేషన్ వద్ద ధర్నా చేయాల్సి వస్తుందని వారు హెచ్చరించారు. శ్లాబ్ కోసం సెంటరింగ్ చేసి వేచి చూస్తున్నామని, ఎక్కువ రోజులు ఈ సెంటరింగ్ నిలబడదని, కూలిపోతే మళ్లీ వేలాది రూపాయలు వెచ్చించి సెంటరింగ్ చేయించుకోవాల్సి వస్తుందని వాపోతున్నారు.

ఈ విషయంపై ఏఈ మహంకాళరావును వివరణ కోరగా.. సైడ్ ఆరమ్స్, హ్యాంగలర్స్ స్టోర్స్ నుంచి ఫ్యాబ్రికేషన్ చేసి రావాలన్నారు. అవి వస్తేనే గాని సమస్య పరిష్కరించడం కుదరదన్నారు. ఈ వారంలో తెప్పించి లైన్లు మార్చి సమస్య పరిష్కరిస్తామన్నారు. మెటీరియల్ తీసుకువచ్చే వాహనాలు యోగాంధ్ర కోసం వినియోగించడం వల్ల వాటిని సకాలంలో రాలేదన్నారు.

క్లుప్తంగా

పరిమితికి మించి ప్రయాణం ప్రమాదకరం



ఆటో యజమానిపై కేసు నమోదు చేస్తున్న ఎస్ఐ సుధాకర్

అచ్యుతాపురం రూరల్: పరిమితికి మించి ప్రయాణాలు ప్రమాదాలకు కారకమవుతాయని సీఐ నమ్మి గణేష్ హెచ్చరించారు. మండలంలో పలు చోట్ల పరిమితికి మించి ప్రయాణాలు సాగించిన వాహనాలపై మంగళవారం పోలీసులు తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేశారు. కార్మికులను తరలిస్తున్న ఆటో, బొలేరో వాహన యజమానులకు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఎస్ఐ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

హైస్కూల్‌ను సందర్శించిన గెయిల్ అధికారులు



డైనింగ్ హాల్‌ను పరిశీలిస్తున్న గెయిల్ అధికారులు

కోటవురట్ల: పాములవాకలోని కిల్లాడ రామ్మూర్తినాయుడు జెడ్పీ హైస్కూల్‌ను గెయిల్ అధికారులు మంగళవారం సందర్శించారు. ఇక్కడ డైనింగ్ హాల్ అసంపూర్తిగా ఉండిపోవడంతో ఐపీఎస్ అధికారి కిల్లాడ సత్యనారాయణ కృషితో గెయిల్ కంపెనీ రూ.22 లక్షలు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. దీనికి కలెక్టర్ పరిపాలనాపరమైన అనుమతులు మంజూరు చేయడంతో గెయిల్ అధికారులు, పీఆర్ జేఈ వర్మ డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. నివేదిక తయారు చేసి కంపెనీకి అందిస్తామని టెండర్ల ప్రక్రియ పూర్తి కాగానే హాల్ నిర్మాణ పనులు ప్రారంభిస్తారని హెచ్ఎం కె.లక్ష్మీనారాయణ తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కిల్లాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బకాయిలు విడుదల చేయాలని వినతి



ఎంపీడీవో జయప్రకాష్‌రావుకు వినతి పత్రం అందిస్తున్న సచివాలయ ఉద్యోగులు

పాయకరావుపేట: ప్రమోషన్ చానల్ కల్పించాలని గ్రామ సచివాలయ ఉద్యోగులు కోరారు. ఈ మేరకు ఎంపీడీవో ఎ.జయప్రకాష్‌రావుకు వినతి పత్రం అందించారు. రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు, ఏరియర్స్ విడుదల చేయాలని, జీవోఎంఎస్ నంబర్ 5 రద్దు చేయాలని, మండల పరిధిలోనే బదిలీలు కల్పించాలని వినతి పత్రంలో కోరారు. ప్రమోషన్ చానల్ కల్పించిన తర్వాత మిగులు సిబ్బందికి రేషనలైజేషన్ చేపట్టాలన్నారు.

గంగాలమ్మ తల్లి గుడికి విరాళాలు



విరాళం అందజేస్తున్న భక్తులు

మునగపాక: మండలంలోని పాటిపల్లి–మంగళవరపుపేట పరిధిలో నిర్మిస్తున్న గంగాలమ్మతల్లి గుడికి పలువురు భక్తులు విరాళాలు అందజేస్తున్నారు. గాజువాక ఉడా కాలనీకి చెందిన భీశెట్టి మహలక్ష్మినాయుడు, లక్ష్మి దంపతులు మంగళవారం తమవంతు సాయంగా రూ.10 వేలు, భీశెట్టి రాజా, గీతా గాయత్రి దంపతులు రూ.5 వేలను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సాగునీటి కాలువల అభివృద్ధికి కృషి



రెగ్యులేటర్లను పరిశీలిస్తున్న ఆవ కాలువ చైర్మన్ సన్యాసినాయుడు

మునగపాక: సాగునీటి కాలువల అభివృద్ధికి ఏషియన్ పెయింట్స్ సహకారం అభినందనీయమని ఆవ కాలువ సంఘ చైర్మన్ ఆడారి ఆనంద సన్యాసినాయుడు పేర్కొన్నారు. 20 సంవత్సరాలుగా ఆవ కాలువలో రెగ్యులేటర్లు, పలు చోట్ల సాగునీటి కాలువలు అధ్వానంగా ఉన్నాయి. ఏషియన్ పెయింట్స్ ఆర్థిక సాయంతో చేపట్టిన వీటి అభివృద్ధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆవ కాలువ అభివృద్ధితో పాటు పిల్ల కాలువలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తామన్నారు.

విత్తన శుద్ధితో మెరుగైన ఫలితాలు



మాట్లాడుతున్న శాస్త్రవేత్త భవాని

మునగపాక: పచ్చిరొట్ట ఎరువులను వినియోగించడం ద్వారా **భూమి** గుల్లబారి మెరుగైన దిగుబడులు **సాధించవచ్చని** శాస్త్రవేత్త భవాని తెలిపారు. మండలంలోని నాగులాపల్లిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రైతులు వరి సాగులో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వరిలో విత్తన శుద్ధితో మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. దీనివల్ల వరికి తెగుళ్ల బెడద ఉండదన్నారు. భూసారానికి అనుగుణంగా పంటల సాగు శ్రేయస్కరమన్నారు. డిప్యూటీ కేన్ కమిషనర్ లోకేష్ మాట్లాడుతూ వరిలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి ఫలితాలు సొంతం చేసుకోవచ్చన్నారు. ఏడీఏ రామారావు మాట్లాడుతూ వరి విత్తనం నాటిన నుంచి పంట చేతికి అందివచ్చేంత వరకు తగు సలహాలు, సూచనలు పాటించాలన్నారు. ఏవో జ్యోత్స్నకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వీఏఏ శ్వేతామీనన్, దొడ్డి శ్రీనివాసరావు, యల్లపు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత నేడు

ఎస్.రాయవరం: కొరుప్రోలు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో చినఉప్పలం ఆక్వా, గుడివాడ హేచరీస్, గెడ్డపాలెం ఐస్ ఫ్యాక్టరీలకు బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. చెట్టుకొమ్మలు, మరమ్మతులు నిమిత్తం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు.

వ్యవసాయంలో మెలకువలపై అవగాహన



రైతులకు వివరిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు



రైతులతో మాట్లాడుతున్న ఏవో సౌజన్య

పాయకరావుపేట: మండలంలో సత్యవరం –1, 2 గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా క్షేత్ర సందర్శన, రైతులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త శ్రీహరి మాట్లాడుతూ పంటలకు ఆశించు చీడపీడలు, వ్యవసాయంలో మెలకువలపై రైతులకు అవగాహన కల్పించారు. ఏవో ఆదినారాయణ విత్తన శుద్ధి గురించి వివరించారు. ఎన్‌పీఎస్ఎస్ యాప్‌పై రైతులకు అవగాహన కల్పిస్తూ పీఎండీఎస్ కిట్లు, పచ్చిరొట్ట ఎరువులు గురించి వివరించారు. ఏఈవో నాగమణి, రైతు సేవా కేంద్రం అధికారులు మౌనిష్, అమృత, సర్పంచ్ రాము పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతుల్లో సాగు చేయండి

ఎస్.రాయవరం: రైతులు లాభసాటి, ఆరోగ్యకరమైన పంటలు సాగు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సౌజన్య తెలిపారు. తిమ్మాపురంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ రైతులు ఆధునిక పద్ధతులపై మెలుకువలు తెలుసుకుని సాగు చేసుకోవాలన్నారు. అనంతరం 30 విత్తనాలు కలిపిన కిట్లు రైతులకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్రి సత్యనారాయణ, నాయకులు వంగలపూడి గోవిందు, కోన అప్పలరాజు పాల్గొన్నారు.

ఘనంగా పోతురాజుబాబు పండగ



ఆలయ సన్నిధిలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

మునగపాక: మండలంలోని ఉమ్మలాడలో పోతురాజుబాబు పండగ మంగళవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి పోతురాజుబాబును దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీటీసీ మొల్లేటి కృష్ణవేణి నారాయణరావు, పార్టీ నేతలు మొల్లేటి శంకర్, వినోద్, మొల్లేటి అచ్చింనాయుడు, ఆటో శ్రీను, పల్లె అప్పలనాయుడు, గణేష్, రవీంద్రరాజు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

లక్ష్యంతో చదువుకుంటే ఉజ్వల భవిష్యత్



విద్యార్థులను సత్కరిస్తున్న జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ

మునగపాక: విద్యార్థులు లక్ష్యం కోసం చదువుకొని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ కోరారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుకున్న ఆరుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైన నేపథ్యంలో మంగళవారం సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చదువులో ఏకాగ్రత ఎంతో అవసరమన్నారు. ఇష్టపడి, కష్టపడి చదువుకొని మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. పిల్లల తల్లిదండ్రులు వారిపై దృష్టి సారించాలన్నారు. ఎస్ఎంసీ చైర్మన్ ఆడారి సూర్యచంద్రరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, పెద్దలు ఆడారి అచ్చియ్యనాయుడు, కర్రి సాయికృష్ణ, దాడి ముసిలినాయుడు, టెక్కలి పరశురామ్, ఆడారి శ్రీకాంత్, పెంటకోట శ్రీరామమూర్తి, ఆడారి గణేష్, హెచ్ఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల పంపిణీ ప్రారంభం



కోటవురట్లలో విత్తనాలు పంపిణీలో రైతులు, ప్రజాప్రతినిధులు

కోటవురట్ల: ఖరీఫ్ వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏవో బి.సరోజిని తెలిపారు. స్థానిక రైతు సేవా కేంద్రం వద్ద విత్తన పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండలానికి మొదటి విడతలో 808 టన్నుల వరి విత్తనాలు వచ్చినట్టు తెలిపారు. ఆర్జీఎల్ 580.8 టన్నులు, ఎంటీయూ 1064 రకం 114.6 టన్నులు, ఎంటీయూ 1061 రకం 34.3 టన్నులు, బీపీటీ 5204 రకం 54.5 టన్నులు, బీపీటీ 3291 రకం 1.2 టన్నులు, ఎంటీయూ 1121 రకం 0.6 టన్నులు, ఎంటీయూ 1224 రకం 13 టన్నులు, ఎంటీయూ 7029 రకం 0.6 టన్నులు, ఎంటీయూ 1318 రకం 9 టన్నులు అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డపాటి అనిల్‌కుమార్, ఎంపీటీసీ వంగలపూడి రాంబాబు, టీడీపీ జిల్లా కార్యదర్శి లాలం కాశీనాయుడు, నాయకులు వేచలపు జనార్దన్, జానకి శ్రీను, పెట్ల లింగన్నాయుడు, రైతులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి 9 మంది విద్యార్థుల ఎంపిక



ఉప్పరాపల్లి విద్యార్థిని పావనిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు



ధర్మవరం విద్యార్థిని ప్రశాంతి

ఎస్.రాయవరం: మండలంలో 9 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. ఎస్.రాయవరం ఉన్నత పాఠశాల నుంచి నలుగురు, ఉప్పరాపల్లి, సైతారుపేట, లింగరాజుపాలెం, కొరుప్రోలు, ధర్మవరం అగ్రహారం పాఠశాలల నుంచి ఒక్కొక్కరు చొప్పున సీట్లు సాధించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు నేరుగా ఇంజినీరింగ్ చదువుకునేందుకు ఆనాడు మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నూజివీడు, బాసర, ఇడుపులపాయ ప్రాంతాల్లో ట్రిపుల్ ఐటీలు నెలకొల్పారు. అప్పటి నుంచి ఐదొందలకుపైగా మార్కులు సాధించిన విద్యార్థులు కేటగిరీలు వారీగా ట్రిపుల్ ఐటీకి ఎంపికై ఇంజినీరింగ్ కల నెరవేర్చుకుంటున్నారని వారు తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థిని శానాపతి పావనిని ఉప్పరాపల్లి పాఠశాలలో ఉపాధ్యాయులు అభినందించారు.

ఎర్రవరంలో గ్రావెల్ దందా



అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేసిన ఎర్రవరం శివారు కొండ ప్రాంతం

అచ్యుతాపురం రూరల్: మండలంలో ఎర్రవరం శివారు కొండ ప్రాంతంలో అధికార పార్టీ నాయకులు అక్రమంగా గ్రావెల్ దందా నిర్వహిస్తున్నారు. గ్రామంలో నిర్మాణాలకు అవసరమైన కొండ గ్రావెల్‌ను మంగళవారం అనధికారంగా తరలించారు. రెవెన్యూ సిబ్బందితో కుమ్మక్కై శివారు గ్రామాల్లో కొండలను పిండేసి, చెరువుల్లో మట్టిని అక్రమంగా తవ్వకాలు చేసి సొమ్ము చేసుకుంటున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి పర్యావరణాన్ని, ప్రభుత్వ ఆస్తిని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

పిచ్చుక గూళ్లు ఏర్పాటు చేయాలి



ధాన్యపు కంకులతో ఉపాధ్యాయులు, గ్రీన్ క్లైమేట్ సభ్యులు

ఎస్.రాయవరం: ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించుకునే విధంగా జీవించాలని గ్రీన్ క్లైమేట్ టీంఎన్‌జీవో వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం తెలిపారు. కొరుప్రోలు ఉన్నత పాఠశాల ప్రాంగణంలో పలు మొక్కలు నాటారు. రత్నం మాట్లాడుతూ పిచ్చుకల కోసం గూళ్లు ఏర్పాటు చేయాలని, పక్షుల కోసం ధాన్యపు కంకులు కుచ్చులు అందుబాటులో ఉంచాలన్నారు. ఔషధ, పండ్ల, పక్షులు గూళ్లు పెట్టుకునే మొక్కలు నాటి పెంచాలని సూచించారు. విద్యార్థులు చదువుతోపాటు ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలపై దృష్టి పెట్టాలన్నారు. హెచ్ఎం ఎస్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి సమస్య

సర్వసభ్య సమావేశంలో సభ్యుల నిలదీత



సమావేశానికి హాజరైన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు



రెవెన్యూ అధికారులను నిలదీస్తున్న సభ్యులు

పాయకరావుపేట: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. ప్రధానంగా మండలంలో తాగునీటి సమస్యపై సభ్యులు నిలదీశారు. ఎంపీపీ ఇసరపు పార్వతి అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో ఈదటం, పాయకరావుపేట, మంగవరం గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించలేదని, పైపులైన్లు ఏర్పాటు లేదని ఆయా గ్రామాల ఎంపీటీసీలు గూటూరు విజయలక్ష్మి రామగోవిందు, గణసాల పద్మ, కశింకోట సత్తిబాబు సభ దృష్టికి తీసుకొచ్చారు. సత్వరమే పనులు చేపట్టడం జరుగుతుందని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ వర్మ సమాధానం చెప్పారు. కొర్లయ్యపేటలో వాటర్ ట్యాంకు నిర్మాణంలో జాప్యమవుతుందని, ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ కోడ కోటేశ్వరరావు నిలదీశారు. మండలంలో శ్రీరాంపురం, ఎస్.నర్సాపురం గ్రామాల పరిధిలోని సాగునీటి చెరువుల్లో అక్రమంగా మట్టి తరలింపుపై రెవెన్యూ అధికారులు ఎందుకు స్పందించలేదని ఆర్ఐ త్రినాథ్‌ను శ్రీరాంపురం సర్పంచ్ గారా కృష్ణప్రసాద్ నిలదీశారు. హోంమంత్రి వీటిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించినప్పటికీ స్పందనలేదన్నారు. దీనిపై ఎంపీడీవో వివరణ ఇవ్వాలని పట్టుబట్టారు. పలు గ్రామాల్లో గోకులం షెడ్ల నిర్మాణాలు చేటప్టడం లేదని పశు సంవర్థక శాఖ (వెటర్నరీ డాక్టర్)ను సభ్యులు ప్రశ్నించారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే నిర్మాణాలు చేపడతామన్నారు. జెడ్పీటీసీ లంక సూర్యనారాయణ మాట్లాడుతూ ఎంపీటీసీలు గౌరవ వేతనం బకాయిలు సత్వరమే ప్రభుత్వం నుంచి విడుదలయ్యే ఏర్పాట్లు అధికారులు చేయాలని ఎంపీడీవోని కోరారు. పాయకరావుపేట, తుని పట్టణాలకు చెందిన చెత్తను తాండవ నదిలో వేస్తున్నారని, తద్వారా నదీ గర్భం కుచించుకుపోతుందని నీటిపారుదల శాఖ అధికారుల దృష్టికి సభ్యులు తీసుకొచ్చారు. సాగునీటి కాలువలకు గేట్లు నిర్మాణం చేపట్టడం లేదని శ్రీరాంపురం సర్పంచ్ కృష్ణప్రసాద్ ప్రశ్నించారు. గ్రామాల్లో ఉపాధి హామీ పనులు తీర్మానాలు చేసినవి చేపట్టకుండా గతంలో పనులు చేపడుతున్నారని వెంకటనగరం సర్పంచ్ వంకా వెంకటరమణ సభ దృష్టికి తీసుకొచ్చారు. వెంకటనగరంలో భూములు స్వాధీనంలో లేనప్పటికీ రెవెన్యూ అధికారులు కొందరికీ వన్‌బీ పత్రాలు జారీ చేస్తున్నారని దీనిపై రైతుల్లో సమస్యలు వస్తున్నాయని పరిశీలించి మంజూరు చేయాలని కోరారు. ఎంపీడీవో కార్యాలయం ఏవో వర్మ మాట్లాడుతూ గ్రామ పంచాయితీల్లో 15వ ఆర్థిక సంఘం నిధులతో రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణాలు సత్వరమే చేపట్టాలని లేకుంటే నిధులు వెనక్కి పోతాయన్నారు. పంచాయితీ రాజ్ జేఈ కచేరీ మాట్లాడుతూ మండలంలో పెండింగ్‌లో ఉన్న భవనాలు నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఇప్పటి వరకు నిర్మాణాలు చేపట్టిన పెండింగ్ బిల్లులు మంజూరు చేస్తే పనులు మరలా చేపడతామని సభ్యులు సమాధానం ఇచ్చారు. ఈ సమావేశంలో మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు ధనిశెట్టి మాధవి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

భూ సర్వే చేసి పట్టాలివ్వాలని వినతి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న గ్రామస్తులు

పాయకరావుపేట: తమ భూములను పూర్తిస్థాయిలో సర్వే చేసి పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని ఈదటం గ్రామస్తులు కోరారు. మంగళవారం వారు తహసీల్దార్ జి.ఆనంద్‌రావుకు వినతి పత్రం అందించారు. ఈదటం గ్రామ రెవెన్యూ పరిధి పాల్మన్‌పేట, రాజయ్యపేట, కొర్లయ్యపేట గ్రామాల్లో సర్వే నంబర్లు 284, 285, 286లో ప్రభుత్వం 40 సంవత్సరాల క్రితం భూములతోపాటు పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేసిందన్నారు. దాంతో రైతు భరోసా డబ్బులు తమ బ్యాంకు ఖాతాల్లో జమవుతున్నాయని తెలిపారు. తమలో కొందరికి పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు కాకపోవడం వల్ల రైతు భరోసా డబ్బులు జమ కావడం లేదని వాపోయారు. ప్రస్తుతం తమ గ్రామంలో రీ సర్వే చేస్తున్నారని, తమ భూములను పూర్తిస్థాయిలో చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోగాడ జోగిబాబు, నేలపాటి గోపాలకృష్ణ, గంపల రాంబాబు, గాతాడ పెద్దిరాజు, బోడపాటి రమేష్, మేకా పెద్దింట్లు, గోగాడ నాగేశ్వరరావు, గాతాడ సత్యనారాయణ, కోటఅప్పలరాజు, మామిడి గొల్ల బాబు, నడింపల్లి నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

వెదురు పొంతలు తొలగించాలి

నర్సీపట్నం: నర్సీపట్నం – తుని ప్రధాన మార్గంలోని పెడిమికొండ రిజర్వ్ ఫారెస్ట్‌లోని వెదురు పొంతలు ఇరువైపులా వ్యాపించి ఉండడం ప్రమాదాలు జరుగుతున్నాయని జనసేన నాయకులు అప్పన్న, ఎస్.ఎస్.జి.దొరబాబు, అద్దేపల్లి గణేష్ డీఎఫ్‌వో శామ్యూల్ దృష్టికి తీసుకువెళ్లారు. వెదురు పొంతలు మెయిన్‌రోడ్డుపై వ్యాపించి ఉండడం వల్ల వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని వాపోయారు.

కార్యకర్తల్లో నూతనోత్తేజం కోసం మండల స్థాయి సమావేశాలు

వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త అమర్‌నాథ్

చోడవరం : పార్టీ కార్యకర్తల్లో నూతనుత్తేజం నింపేందుకు మండలాలు, గ్రామస్థాయిలో కార్యకర్తల సమావేశాలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టామని చోడవరం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ మంత్రి, జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. ఈనెల 29న చోడవరం మండల స్థాయి కార్యకర్తల సమావేశాన్ని చోడవరంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిలో భాగంగా సమావేశం నిర్వహించే సీతారామ కల్యాణమండపాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. మండల స్థాయిలో జరిగే ఈ సమావేశానికి అన్ని గ్రామాల నుంచి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని అమర్‌నాథ్ కోరారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఏడువాక సత్యారావు, జిల్లా యూత్ అధ్యక్షుడు పుల్లేటి వెంకటేష్, మండల అధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ పల్లా నర్సింగరావు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.